క్లుప్తంగా

పురిటిపెంటలో ఉచిత వైద్యశిబిరం



రోగిని తనిఖీ చేస్తున్న మరుపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సాయి కృష్ణారెడ్డి

గజపతినగరం: మండల పరిధి పురిటిపెంట – 2 గ్రామ సచివాలయం పరిధిలోని వెల్‌నెస్ సెంటర్‌లో 104 సిబ్బంది బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సాయికృష్ణారెడ్డి 83 మంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు.

అర్తమూరులో పారిశుధ్య పనులు



కాలువలో మురుగు తీస్తున్న కార్మికులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరులో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కాలువల్లోని చెత్తాచెదారాలను సర్పంచ్ పొన్నాడ కుమార్ ఆధ్వర్యంలో కార్మికులు తొలగించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ ప్రజలకు సూచించారు.

మాజీ ఎంపీ సోదరుడి మృతి



కెంబూరి భరత్ మోహన్ (ఫైల్)

చీపురుపల్లి: మాజీ ఎంపీ కెంబూరి రామ్మోహనరావు సోదరుడు కెంబూరి భరత్‌మోహన్ బుధవారం తెల్లవారుఝామున ఆకస్మికంగా మృతి చెందారు. ఇతని సోదరి మాజీ మంత్రి కిమిడి మృణాళినితో పాటు పలువురు ఈయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

బాధ్యతల స్వీకరణ



నాగభూషణరావు

వేపాడ: మండల విద్యాశాఖాధికారి-1గా నాగభూషణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గరుగుబిల్లి మండలం ఎంఈఓగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అలాగే ఇంతవరకు ఇక్కడ ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వరరావు ఇన్‌చార్జ్ ఎంఈఓగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నాగభూషణరావును ఉపాధ్యాయ సంఘ నాయకులు పిన్నింటి వెంకటరమణ, నరసింహమూర్తి, సీహెచ్ అర్జునరావు అభినందించారు.

రేపటి నుంచి సాంబమూర్తి తీర్థం

వేపాడ: మండలంలోని వల్లంపూడిలో సాంబమూర్తి ఆలయం తీర్థ మహోత్సవాలు 24, 25 తేదీల్లో నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా 24న రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. సాయంత్రం పారిశుధ్య కార్మికులకు సన్మానం చేస్తామని తెలిపారు. 25న ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

వైభవంగా రావాలమ్మ జాతర



గ్రామంలో భక్తుల ఊరేగింపు

కొత్తవలస: మండలంలోని కొత్తసుంకరపాలెంలో గ్రామదేవత రావాలమ్మ తీర్థం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ప్రతిరూపమైన పూజారమ్మకు 101 బిందెల ముత్రాటతో స్నానం చేయించి.. గరిడీలు, తప్పెడగుళ్ల,కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. అనంతరం సాయంత్రం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- సంక్రాంతి లోగా రహదారులకు మరమ్మతులు చేస్తామన్న కూటమి నాయకులు
- పండగ పూర్తయినా పత్తా లేని ప్రజా ప్రతినిధులు
- ప్రజలకు తప్పని ప్రయాణ కష్టాలు

అధ్వాన రహదారులపై.. రాకపోకలెలా..?



రాళ్లు తేలిన కృష్ణాపురం రోడ్డు

శృంగవరపుకోట: నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొన్నిచోట్ల రాళ్లు తేలి నడవడానికే ఇబ్బందిగా ఉంటే.. మరికొన్ని చోట్ల గోతులతో నిండి ప్రమాదాలకు స్వాగతం పలుకుతున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..సంక్రాంతి నాటికి గోతుల్లేని రహదారులను ఏర్పాటు చేస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదు. నియోజకవర్గ పరిధిలో నిజంగా సమస్య ఉన్న రోడ్లను వదిలేసి.. కాస్తంత గోతులున్న రోడ్లను ఎంచుకుని మరమ్మతులు చేశామని చెప్పి బిల్లులు చేసుకున్నారు. జీఓ 53లో 16 రోడ్ల మరమ్మతులకు రూ.154.9 లక్షలు మంజూరు చేయగా తూతూమంత్రంగా గోతులు పూడ్చి చేతులు దులుపుకున్నారు. జీఓ 348లో ఆరు పనులకు గానూ 30.4 లక్షలు.. జీఓ 349లో 10 రోడ్లు మరమ్మతులకు గాను రూ. 32.2 లక్షలు కేటాయించినా, ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. దీంతో పలు రోడ్లలో రాకపోకలకు సైతం ప్రజలు అవస్థలు పడుతున్నారు. వేపాడ, ఎస్.కోట మండలాల్లో గోతులు పడ్డ రహదారులే అందుకు సాక్ష్యాలు.



నిధులున్నా అభివృద్ధికి నోచుకోని ఆతవ రోడ్డు



గోతులు పడిన వేపాడ - వాయిలపాడు రోడ్డు



సోంపురం - వేపాడ రోడ్డు దుస్థితి



రాళ్లు తేలిన పాత అలుగుబిల్లి రహదారి



బొడ్డవర, దారపర్తి పంచాయతీల్లో గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారి



పెదకండేపల్లి - శృంగవరపుకోట రోడ్డు దుస్థితి



కంకర తేలిన పీకే పల్లి - సుగర్ కాటా రోడ్డు

ఇంటింటి కుళాయి పనులకు భూమిపూజ

లక్కవరపుకోట: మండలంలోని ఖాసాపేట గ్రామ శివారు ముత్యాలమ్మపాలెంలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు సంబంధించి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఆర్.సన్యాసిరావు మాట్లాడుతూ.. రూ. 34.10 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్, ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే రంగాపురం గ్రామంలో రూ. 22 లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే లలితకుమారి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.భూపాల్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మపాలెంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

నష్టపోయిన రైతులను ఆదుకోండి



తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు, బాధిత రైతులు

- ఏపీ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల వినతి

శృంగవరపుకోట: పంట చేతికొచ్చిన తరుణంలో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునే దిశగా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ అరుణకుమారిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, సహాయ కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ.. మామిడిపల్లి గ్రామంలో 20వ తేదీ రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఎనిమిది మంది రైతులు ఆరుగాలం కష్టపడి దాచుకున్న ధాన్యం పురులు పూర్తిగా కాలి బూడిదయ్యాయన్నారు. దీంతో వేలాది రూపాయల నష్టం సంభవించిందని, బాధిత రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామికవేత్తలు నష్టపోతే కోట్ల రూపాయలు పరిహారంగా ఇచ్చే నాయకులు, ప్రభుత్వాలు.. రైతులు నష్టపోతే నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడం న్యాయం కాదన్నారు. తక్షణమే నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీరితో పాటు కార్యక్రమంలో బాధిత రైతులు కె.వంశీ, కె.భవానీ, కె.శ్రీనివాసరావు, కె.అప్పలనాయుడు, కె.ఈశ్వరరావు, కె.రాజేష్, కె.సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట సాగుపై అవగాహన

గజపతినగరం: మొక్కజొన్న సాగుకు సంబంధించి ఎరువుల యాజమాన్యంపై స్థానిక మండల వ్యవసాయాధికారి సీహెచ్ ధనలక్ష్మి అవగాహన కల్పించారు. మండలంలోని తుమ్మికాపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుగులు, తెగుళ్ల యాజమాన్యంతో పాటు మొక్కజొన్నలో వచ్చే భాస్వరం, జింక్, పొటాష్ లోపంపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న సాగు చేసే ప్రతి రైతూ ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల అన్ని రకాల పంటలకు సంబంధించి సూచనలు, సలహాలు తెలుస్తాయని చెప్పారు. అనంతరం పెసర, మినప పంటను పరిశీలించి అధిక దిగుబడుల కోసం పూత దశలోనే ఎన్‌పీకే, 19.19.19 మందులను పిచికారీ చేయాలని సూచించారు.



మొక్కజొన్న సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ధనలక్ష్మి

ప్రత్యేక పూజలు

బొండపల్లి మండలంలోని దేవుపల్లిలో గల రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో పుష్య బహుళ అష్టమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. – బొండపల్లి



తీగలు తాకాయో అంతే..

గజపతినగరం మండలం పాతబగ్గాంలో గడ్డి లోడులతో ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. బుధవారం కూడా ఓ ట్రాక్టర్ డ్రైవర్ గడ్డిలోడుతో వస్తుండగా.. విద్యుత్ తీగలు ఎక్కడ గడ్డికి తాకుతాయోనని స్థానికులు ఆందోళన చెందారు. విద్యుత్ తీగలకు తగిలేంత ఎత్తు వరకు గడ్డి వేయడంపై పలువురు మండిపడుతున్నారు. – గజపతినగరం



సందర్శన..

గంట్యాడ మండలంలోని గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం ఆవల ఉన్న దిగువ కొండపర్తి గిరిజన గ్రామాన్ని ఆర్డీఓ దాట్ల కీర్తి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హౌసింగ్ లబ్ధిదారులకు కేటాయించిన స్థలం తాటిపూడి ఇరిగేషన్ ప్రాజెక్ట్ స్థలమా.. లేక రెవెన్యూ స్థలమా అన్నది పరిశీలించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ పీడీ కూర్మినాయుడు, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్‌ఐ ప్రసాద్, హౌసింగ్ ఏఈ రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు. – గంట్యాడ



మరిడిమాంబకు గాజుల అలంకరణ..

కొత్తవలస మండలంలోని మంగళపాలెంలో మరిడిమాంబ తీర్థం సందర్భంగా రెండు వేల గాజులతో అమ్మవారిని బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. – కొత్తవలస



పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

బొండపల్లి: పాడి రైతులతో పాటు గొర్రెలు, మేకలు పెంపకందారులు ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా జె.డి వైవీ రమణ కోరారు. మండలంలోని కెరటాం గ్రామంలో బుధవారం నిర్వహించిన పశు వైద్యశిబిరంలో ఆయన పాల్గొని గొర్రెలు, మేకలకు మందులు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పశు సంరక్షణ కోసమే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎ.డి అనురాధ, బొండపల్లి పశువైద్యాధికారి ఎం.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

1568 పశువులకు..

మెరకముడిదాం: మండలంలోని ఉత్తరావల్లి, గాదెలమర్రివలస గ్రామాల్లో 1568 పశువులకు నట్టల నివారణ టీకాలు వేసినట్లు మెరకముడిదాం పశువైద్యాధికారి సీహెచ్ హైమావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువుల పెంపకంలో మెలకువలు పాటించాలన్నారు. నట్టల నివారణ మందులతో పాటు ఎద ఇంజక్షన్లు, గోట్ ఫాక్స్, షీప్ ఫాక్స్ నివారణకు మందులు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చీపురుపల్లి: పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఎ.డి డాక్టర్ ఆర్. శారద కోరారు. మండలంలోని దేవరపొదిలాం, నిమ్మలవలస, గుణిదాం గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 162 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు.. 1160 పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. అలాగే 1500 గొర్రెలకు నట్టల నివారణ వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అధికార్ల శ్రీనుబాబు, మాజీ సర్పంచ్ వర్మ పాల్గొన్నారు.

పశువులకు మెరుగైన వైద్యం..

గుర్ల: పశువులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెట్టంగి పశువైద్యాధికారి ఎస్.సతీష్ అన్నారు. మండలంలోని చింతపల్లిపేట, నాగళ్లవలసలోని పశు వైద్యశిబిరాలు నిర్వహించి 200 పశువులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు జమ్ము అప్పలనాయుడు, లెంక సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

800 జీవాలకు..

లక్కవరపుకోట: మండలంలోని కిత్తన్నపేటలో నిర్వహించిన ఉచిత పశు వైద్యశిబిరంలో 800 జీవాలకు నట్టల నివారణ మందు వేసినట్లు పశు వైద్యాధికారి కె.గాయత్రి తెలిపారు. అలాగే 11 పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు, 24 పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స, 120 పశువులకు సాధారణ చికిత్సలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దుక్క వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



బొండపల్లి: కెరటాంలో గొర్రెలకు మందులు వేస్తున్న పశు సంవర్ధక శాఖ జె.డి రమణ



మెరకముడిదాం: గాదెల మర్రివలస పశువైద్య శిబిరంలో పశువును పరీక్షిస్తున్న వైద్యాధికారి హైమావతి



చీపురుపల్లి: రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ఎ.డి శారద, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనుబాబు, తదితరులు



గుర్ల: చింతపల్లిపేటలో పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేస్తున్న పశు వైద్యాధికారులు, స్థానిక నేతలు



లక్కవరపుకోట: జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి గాయత్రి, తదితరులు

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయండి..

కొత్తవలస: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పది, ఇంటర్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గురుకులాల ఉమ్మడి విజయనగరం జిల్లా కో ఆర్డినేటర్ ఎస్. రూపవతి పిలుపునిచ్చారు. మండలంలోని వియ్యంపేట వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో శతశాతం ఉత్తీర్ణతకు తీసుకోవల్సిన చర్యలపై విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు చెందిన గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాళ్లకు బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాల్లోని 13 గురుకులాల నుంచి ప్రస్తుత ఏడాది 10వ తరగతి పరీక్షలకు 1006 మంది విద్యార్థులు.. ఇంటర్మీడియట్ పరీక్షలకు 600 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. సమయం వృథా చేయకుండా విద్యార్థులు చదువుకునేలా చర్యలు తీసుకోవడంతో పాటు వారి ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గురుకులాల ఉమ్మడి విజయనగరం జిల్లా కో ఆర్డినేటర్ ఎస్. రూపవతి

‘గాదె’ను గెలిపించండి

మెరకముడిదాం: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కావాలంటే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరఫున పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులునాయుడును గెలిపించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు కోరారు. మండలంలోని గరుగుబిల్లి, సాతాంవలస, గోపన్నవలస, మెరకముడిదాం, ఉత్తరావల్లి జెడ్పీ పాఠశాలలతో పాటు మెరకముడిదాం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, గర్భాం ఏపీ మోడల్‌స్కూల్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బుధవారం కలిసి గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా ప్రచారం చేసారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ప్రతినిధులు ఆర్.సింహాద్రి, ఆల్తి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణార్థులతో సమావేశం నేడు

దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం పొదుపు మహిళలకు అవగాహన కల్పించే శిక్షకులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో శిక్షణ పొందిన వారు గ్రామ స్థాయిలో పొదుపు సంఘ సభ్యులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

మోకాళ్లపై నిల్చోబెట్టారు..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరు ప్రాథమికోన్నత పాఠశాలలో హోమ్‌వర్క్ చేయని విద్యార్థులను పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకుని ఆరుబయట మోకాళ్లపై నిల్చోబెట్టారు. బుధవారం ఈ సంఘటన చోటుచేసుకోగా.. స్థానికులు స్పందించి విద్యార్థులను ఇలా శిక్షించడం సరికాదని సంబంధిత సైన్స్ ఉపాధ్యాయుడ్ని నిలదీశారు. అయితే హోమ్‌వర్క్ చేయకపోవడంతో ఇలా చేయాల్సి వచ్చిందని ఆ ఉపాధ్యాయుడు బదులిచ్చాడు. ఈ విషయం సోషల్‌మీడియాలో హల్‌చల్ కావడంతో ఇదే అంశంపై హెచ్‌ఎం.రామారావును వివరణ కోరగా.. సంక్రాంతి పండగలో ఇచ్చిన హోమ్‌వర్క్‌ను పూర్తి చేయకపోవడంతో సైన్స్ ఉపాధ్యాయుడు పనిష్మెంట్ ఇచ్చారని, స్థానికులు వ్యతిరేకించడంతో వెంటనే విరమింపజేశామని బదులిచ్చారు.

మరమ్మతులు..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి 220/132/33 కేవీ ఉప కేంద్రంలో 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఈఈ మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ.. వచ్చే నెల 11 వరకు మరమ్మతులు కొనసాగుతాయని చెప్పారు.

నేడు శిక్షణ

గజపతినగరం: వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపీడీఓ అధ్యక్షతన వలంటీర్ టీచర్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గల పాత మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం పదిన్నర గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అలాగే స్థానిక ఏరియా ఆస్పత్రిలో దివ్యాంగుల పింఛన్ ధ్రువపత్రాల పునఃపరిశీలన గురువారం ఉదయం 9.30 గంటలకు జరుగుతుందని మరో ప్రకటనలో తెలిపారు.

వేపాడలో..

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్న లక్ష్యంతో నిర్వహించే ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు గాను శిక్షణ పొందిన వలంటీర్లకు పలు సూచనలు చేయడంతో పాటు మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం

వేపాడ: మండలంలోని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు కొత్తవలసలో గల మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ హోదాల్లో పనిచేసిన మాజీ చైర్మన్‌లు, డైరెక్టర్లు హాజరుకావాలని కోరారు.